క్లుప్తంగా

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

జామి: కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి శుక్రవారం సహస్రనామార్చన, ధూప సేవ, నక్షత్రహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయాభివృద్ధికి ఆర్థిక సహాయం


ఆలయ కమిటీకి నగదు అందజేస్తున్న సర్పంచ్ రామునాయుడు

వేపాడ: మండలంలో చినగుడిపాల గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ఆలయాభివృద్ధికి స్థానిక సర్పంచ్ బోజంకి రాము నాయుడు రూ.20 వేల ఆర్థిక సహాయం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు వేచలపునాయుడుబాబు, నచ్చిరెడ్డి లక్ష్మణ, వెంకటరావు, దేముడు, డోకల వెంకటరావు తదితరులకు శుక్రవారం నగదు అందజేశారు.

పరామర్శ


సంతోష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆల్తి సంతోష్ నాన్నమ్మ ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శుక్రవారం దత్తిగ్రామం వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ఉపేంద్రరావు

చీపురుపల్లి: స్థానిక పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హెచ్.ఉపేంద్రరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాజాం రూరల్ సీఐగా విధులు నిర్వహించిన ఈయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన స్థానిక కనకమహాలక్ష్మి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయన వెంట ఎస్‌ఐ ఏ.సన్యాసినాయుడు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపునకు తీర్మానం

శృంగవరపుకోట: స్థానిక విశాఖ- అరకు రోడ్డులో రెండు వైపులా ఉన్న ఆక్రమణలు తొలగింపులకు పంచాయతీ పాలక వర్గం తీర్మానం చేసింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సంతోషికుమారి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. పంచాయతీలో సమస్యలపై చర్చించారు. పంచాయతీలో చేపట్టనున్న 12 అభివృద్ధి పనులకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. పంచాయతీ ఈఓ కన్నబాబు మాట్లాడుతూ సబ్‌రిజిస్ట్రార్ నుంచి రూ.1.50 కోట్లు పంచాయతీకి వచ్చే అవకాశం ఉందని, సాధారణ నిధులు రూ.5లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.50 లక్షలు ఉన్నాయని చెప్పారు.

నేటి కార్యక్రమాలు

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

జామి: మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం భీమసింగి ముత్యాలమ్మ కల్యాణ మండపంలో శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ గొర్లె రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఎస్.కోట,గజపతినగరం నియోజకవర్గ ఎమ్మెల్యే లు కడుబండి శ్రీనివాసరావు,బొత్స అప్పలనరసయ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు,గృహసారథులు,పార్టీ నేతలు హాజరుకావాలని కోరారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలు

బొండపల్లి/ మెరకముడిదాం: బొండపల్లి మండలంలోని కనిమెరక, మెరకముడిదాం మండలంలోని ఇప్పలవలస గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు వై.వి.రాజేంద్రప్రసాద్, ఎం.రత్నం శుక్రవారం తెలిపారు. సచివాలయాల పరిధి గ్రామాల ప్రజలు శిబిరాల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

వీలుపర్తిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

వేపాడ: వీలుపర్తి సచివాలయం పరిధిలో శనివారం సాయంత్రం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించనున్నట్లు ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు శుక్రవారం తెలిపారు. మండల, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

ఊరిలోనే సూపర్‌స్పెషాలటీ వైద్యం


చీపురుపల్లిరూరల్(గరివిడి): వెదుళ్లవలస శిబిరంలో అందించిన వైద్యసేవల వివరాలను వైద్యాధికారులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి బొత్స సత్యనారాయణ


గజపతినగరం: పురిటిపెంటలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


శృంగవరపుకోట: ఎస్.కోటలో వైద్యసేవలపై ప్రజలను ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


వేపాడ: ఆతవ గ్రామంలో రోగులకు వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


చీపురుపల్లిరూరల్: అలజంగిలో వైద్యసేవలను పరిశీలిస్తున్న ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష

'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తోన్న వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు తమ సొంత ఊరిలోనే సూపర్‌స్పెషాలటీ ఆస్పత్రిస్థాయి వైద్యం అందుతోందని మంత్రి బొత్స సత్యనారాయణ, ఎస్.కోట, గజపతినగరం ఎమ్మెల్యేలు కడుబండి శ్రీనివాసరావు, బొత్స అప్పలనరసయ్య, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పట్టణాలు, గ్రామాల్లో కొనసాగుతున్నాయి. శుక్రవారం నిర్వహించిన శిబిరాలను ప్రజాప్రతినిధులు సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను ఆరా తీశారు. అవసరమైన వారికి మందుల కిట్లు, నేత్రసమస్యలు ఉన్న వారికి కళ్లద్దాలు అందజేశారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. శిబిరాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు సందర్శించారు.

– సాక్షి నెట్‌వర్క్


కొత్తవలస: కాటికాపల్లి శిబిరంలో వైద్యపరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు


జామి: జాగరంలో శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ అరుణ, జిల్లా మలేరియా అధికారి వై.మణి


శృంగవరపుకోట: ఎస్.కోటలో వైద్య శిబిరాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


గంట్యాడ: మధుపాడలో వృద్ధురాలకి మందులు అందజేస్తున్న ఎంపీపీ హైమావతి


గజపతినగరం: పురిటిపెంటలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌లో వంటకాలను రుచి చూస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య


లక్కవపుకోట: మార్లాపల్లి వైద్యశిబిరం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడుబండి

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక


గంట్యాడ: ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణారావు

గంట్యాడ: మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం రామకృష్ణారావు శుక్రవారం తెలిపారు. విజయనగరంలో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో అండర్-19 బాలుర విభాగంలో కె.వెంకటేష్, బాలికల విభాగంలో పి.గాయత్రి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు, వ్యాయామ ఉపాధ్యాయిని రాధ,ఉపాధ్యాయులు అభినందించారు.

వేపాడ గురుకులం నుంచి రమ్య..


విద్యార్థిని రమ్య

వేపాడ: స్థానిక గురుకుల బాలికల పాఠశాల ఇంటర్ విద్యార్థిని రమ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ శుక్రవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గురువారం బాలికలకు నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీల్లో వేపాడ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని రమ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. విద్యార్థినితో పాటు పీడీ ఆదిలక్ష్మి, పీఈటీ అరుణను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినులు అభినందించారు.


చీపురుపల్లి: ఆనంద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ప్రసాద్, తదితరులు

శ్రీనివాస కళాశాల నుంచి ఒకరు ..

చీపురుపల్లి: స్థానిక శ్రీనివాసా జూనియర్ కళాశాలకు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థి బెవర ఆనంద్ అండర్-19 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ఈ విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ ప్రసాద్, కళాశాల డైరెక్టర్ మూర్తి అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


గజపతినగరం: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న చైతన్య భారతి సంస్థ, లయన్స్ క్లబ్ సభ్యులు

గజపతినగరం: స్థానిక లయన్స్ క్లబ్ భవనంలో చైతన్య భారతి స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్ సంయుక్తంగా గురువారం రాత్రి ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న పలువురికి సన్మానించారు. రచయత గంట్రేటి గౌరినాయుడు, లయన్స్‌క్లబ్ రీజనల్ చైర్మన్ బెల్లాన లక్ష్మి నరేంద్ర, చైతన్య భారతి సంస్థ అధ్యక్షుడు బుద్దరాజు వెంకటశ్రీరామ, గజపతినగరం,బొండపల్లి,మెంటాడ మండలాల ఎంఈఓలు ఎస్.విమలమ్మ,అల్లు వెంకటరమణ,కె.మోహన్‌రావు, చైతన్య భారతి సంస్థ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వి.కృష్ణారావు, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఆధుర్తి రామ కృష్ణ, చైతన్య భారతి ప్రధాన కార్యదర్శి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు బొంతల కోటి శంకరరావు, హెచ్ఎంల సంఘం అధ్యక్షుడు టి.సన్యాసిరాజు, నాలుగు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చీపురుపల్లి: విశ్రాంత ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న సర్పంచ్, ఉపాధ్యాయులు

రామలింగాపురంలో..

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం గొర్లె పద్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, సమాజ సేవకుడు గొర్లె రమణ దంపతులను గ్రామ సర్పంచ్ ఇప్పిలి నారాయణమ్మ, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు వి.మోహనరావు, ఉపాధ్యాయు లు కె.విశ్వేశ్వరరావు, ఎం.అప్పారావు, కె.సూర్యనారాయణ, రఘురామయ్య, వి.మురళీకృష్ణ, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఈకేవైసీ శతశాతం పూర్తి చేయండి


బొండపల్లి: అంబటివలసలో ఈకేవైసీ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న ఏఓ మల్లికార్జునరావు


శృంగవరపుకోట: సంతగవిరమ్మపేటలో ఈకేవైసీ చేయిస్తున్న ఏఓ రవీంద్ర, వీఏఏలు

బొండపల్లి: మండలంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు సంబంధించి ఈకేవైసీని ఈనెల8వ తేదీలోగా శతశాతం పూర్తిచేయాలని ఏఓ పి.మల్లికార్జునరావు సచివాలయ వీఏఏలు, వీహెచ్ఏలకు సూచించారు. మండలంలోని అంబటివలస, గొట్లాం గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఆరుగంటలకే గ్రామానికి వ్యవసాయ సిబ్బంది చేరుకుని చేపట్టిన ఈకేవైసీ ప్రక్రియను ఏఓ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు పూర్తయిన ప్రతీ రైతు ఈకేవైసీని తప్పనిసరిగా చేయించాలని సూచించారు. అన్ని సచివాలయాల పరిధిలో వ్యవసాయ సిబ్బంది తమ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఆయన వెంట అంబటివలస ఎంపీటీసీ తాళ్లపూడి అప్పలనాయుడు, గొట్లాం పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ, గొట్లాం వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల తులసీరాం, తదితరులున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

శృంగవరపుకోట: పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ కె.రవీంద్ర సూచించారు. సంతగవిరమ్మపేట గ్రామంలో రైతులకు వ్యవసాయ సిబ్బందితో కలిసి శుక్రవారం ఈకేవైసీ చేయించారు. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకే మన జిల్లాలో ఈకేవైసీకి ప్రభుత్వం అనుమతించిందని, రైతులు తమ సమీప రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను కలిసి ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈకేవైసీ చేయించుకున్న రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తామని, పంటల బీమా వర్తిస్తుందని, ప్రభుత్వ ఇతర రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. వీఏఏలు రవిచంద్ర, భాస్కర్, వివేక్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.

9వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలి

జామి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ-క్రాప్ నమోదు చేసుకున్న ప్రతీరైతు ఈనెల 9వ తేదీలోగా ఈకేవైసీ చేయించు కోవాలని ఏఓ కిరణ్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో సూచించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే ఈకేవైసీ ప్రక్రియ అవుతుందని, రైతులు గమనించాలని స్పష్టం చేశారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు


వేపాడ: సోంపురం గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవడానికి గ్రామసభలు దోహదపడతాయని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. సోంపురంలో సర్పంచ్ మురిపిండి గంగరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వ హించిన గ్రామసభకు ఆయన అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీకి వచ్చే నిధులతో గ్రామాల్లో తక్షణ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించుకోవాలని సూచించారు. ఎంపీపీ సత్యవంతుడు, పంచాయతీకార్యదర్శి, వార్డుమెంబర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. అలాగే చినగుడిపాలలో సర్పంచ్ రామునాయుడు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.

గజపతినగరంలో..

గజపతినగరం: గజపతినగరంలో సర్పంచ్ నరవ కొండమ్మ అధ్యక్షతన శుక్రవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇతర సమస్యల పరిష్కారానికి తీర్మానాలు చేశారు. వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు, పంచాయతీ కార్యదర్శి ఎం.రమణ పాల్గొన్నారు.

రేపటి నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

శృంగవరపుకోట: దేవదాయశాఖ ఆదేశాల మేరకు స్థానిక దారగంగమ్మ ఆలయంలో ఈనెల 8వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈఓ నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8న ఉదయం 10గంటలకు కె.బాబూరావు మాస్టారు ధార్మికోపన్యాసం, 9న సాయంత్రం 6గంటలకు కె.నిర్మల భాగవతార్‌చే రుద్రాక్ష మహిమ హరికథ, 10న సాయంత్రం 6గంటలకు నర్తనశాల డ్యాన్స్ అకాడమీ వారి నృత్యప్రదర్శన, 11న ఉదయం 10గంటల లకు తమ్మిన సోదరుల సంగీత కార్యక్రమం, 12న సాయంత్రం 6గంటలకు భజన, 13న ఉదయం 10గంటలకు కోలాటం, 14న ఉదయం 9గంటలకు చండీ హోమం, సాయంత్రం 6గంటలకు పారాయణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు హాజరై కార్యక్రమాలను దిగ్విజం చేయాలని కోరారు.

టీడీపీ మాయ మాటలు నమ్మవద్దు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే అప్పలనరసయ్య


మహిళలకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

మెంటాడ(గజపతినగరం రూరల్): ఎన్నికలు సమీపిస్తుండడంతో టీడీపీ నాయకులు గ్రామాల్లోకి వచ్చి మాయమాటలు చెబుతారని, బూటకపు హామీలు గుప్పిస్తారని, వారిని నమ్మవద్దని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలకు సూచించారు. మండలంలోని మరుపల్లి గ్రామంలో శుక్రవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలను వివ రించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని అన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు 600 మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, తర్వాత పథకాలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేశారని గుర్తు చేశా రు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, పార్టీలకతీతం గా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు.

టీడీపీ ఓ దొంగల ముఠా

మరుపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే అప్పలనరసయ్య విలేకరులతో మాట్లాడారు.అవినీతి చేసిన చంద్రబాబునాయుడి కోర్టు రిమాండ్ విధిస్తే.. టీడీపీ నాయకులు కొంతమంది టెంటులు వేసుకుని అవినీతి చంద్రుడుకి సంఘీభావం తెలుపు తు న్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ఒక దొంగలముఠా అని అన్నారు. నాలుగేళ్లుగా నియోజకవర్గ ప్రజలను పట్టించుకోని టీడీపీ మాజీ ఎమ్మెల్యే కె.ఏ.నాయుడు ఇప్పుడు చంద్రబాబును జైలులో పెట్టినరికి రోజూ టెంట్ కింద కూర్చొని దీక్ష చేస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీకి నూకలు చెల్లాయ ని, చంద్రబాబు చేసిన అవినీతిపై రాష్ట్ర ప్రజలు తమ ఓటు ద్వారా కక్ష తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంపీడీఓ కిశోర్ కుమార్, తహసీల్దార్ అరుణ, రాష్ట్ర అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ గార తవుడు, నాయకులు మండల సురేష్, బూడి వెంకటరావు, బెల్లాన త్రినాథ, కరణం ఆదినారా యణ పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశంశుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే అతిథిగా హాజరయ్యారు. ముందుగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు వినిపించగా...తర్వాత ప్రజాప్రతినిధులు తమ గ్రామాల్లో సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయఅధికారి అనురాధ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధిం చిన ఈ-క్రాప్, ఈకేవైసీ ప్రక్రియ చురుగ్గా సాగుతోందని చెప్పారు. మండల రైతులకు ఇంకా వంద మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి ఏఓ తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సోమవారం నాటికి యూరియా మండలానికి చేరుకుంటుందని చెప్పారు. ఈ-క్రాప్, ఈకేవైసీ శతశాతం పూర్తి చేయాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను వారం రోజుల్లోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి,వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు,మిత్తిరెడ్డి రమేష్,ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీను, ఎంపిడీఓ సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ఏ ఏఈ ఉపేంద్ర, వైద్యాధికారులు సంతోషిరూప, సతీష్‌కుమార్, పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఎంపికలు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగం-13 ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక శుక్రవారం నిర్వహించారు. విశాఖ-13 ఆంధ్రా బెటాలియన్ అధికారులు నాయక్ సుబేదార్ హరీష్‌పాండే, హవాల్దార్ మదన్మోహన్ సమక్షంలో విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. 21 మందిని ఎంపిక చేశారు. ప్రిన్సిపాల్ సీహెచ్.కేశవరావు, ఎన్‌సీసీ కేర్‌టేకర్ భాస్కర్ పర్యవేక్షించారు.